ఎస్‌ఎంసీల్లో ఏకగ్రీవాల హవా

- 134 కమిటీలకుగాను 127 చోట్ల ఏకగ్రీవం
- 5 చోట్ల ఎన్నికలు..ఒక చోట కోర్టు కేసు, మరో చోట కోరంలేక వాయిదా

ఒంగోలు: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గ వ్యాప్తంగా ఏకగ్రీవ హవా కొనసాగింది. మొత్తం 134 కమిటీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 127 చోట్ల ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. అయిదు చోట్ల ఎన్నికలు జరగ్గా మరో చోట కోర్టు కేసు కారణంగా వాయిదా పడింది. ఇంకో చోట కోరం లేక ఎన్నిక వాయిదా వేశారు.

ఒంగోలు మండలంలో 59 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 18 ఉన్నత పాఠశాలలు వెరసి మొత్తం 82 పాఠశాలలున్నాయి. వీటిలో 58 ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత, 18 ఉన్నత పాఠశాలలు ఏకగ్రీవం అయ్యాయి. స్థానిక మంగమూరు డొంకలోని శ్రీవివేకానంద విద్యా విహార్ ఓరియంటల్ ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలలో కోర్టు కేసు కారణంగా ఎన్నిక ప్రక్రియను అధికారులు నిలిపివేశారు. ఏకగ్రీవం అయిన పాఠశాలలకు సంబంధించి ప్రాథమిక పాఠశాలలకు 720 మంది సభ్యులు, ప్రాథమికోన్నత పాఠశాలకు 102 మంది, ఉన్నత పాఠశాలకు 353 మంది వెరసి 1175 మంది సభ్యులను ఎన్నుకున్నారు. వీరంతా తమ పాఠశాల పరిధిలో పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. అనంతరం వారిచే పాఠశాల హెడ్మాస్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీ బాధ్యతలు, వారికి ఉండే అధికారాలను వివరించారు.


అధికారాలు, బాధ్యతల గురించి వివరిస్తున్న ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబు


ఉప్పుగుండూరులో ఎన్నుకున్న కమిటీతో ఉపాధ్యాయులు

ఒంగోలు రూరల్: రూరల్లోని అన్ని పాఠశాలలో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కరవది ఎయిడెడ్ సీఈ స్కూల్లో హెచ్ఎం జి. రామకృష్ణ, జి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చైర్మన్‌గా రాయపాటి ప్రమీల, వైస్ చైర్మన్‌గా పులగర హరిబాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ముక్తినూతలపాడు హెచ్ఎం దేవసేన ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా పి. అంకయ్య వైస్ చైర్మన్‌గా ఎం. ధనలక్ష్మి ఎంపిక కాగా, త్రోవగుంట హెచ్ఎం చల్ల బ్రహ్మయ్యా ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా కె. చిరంజీవి, వైస్ చైర్మన్‌గా నాగ జ్యోతి ఎన్నికయ్యారు. ఉలిచిలో హెచ్ఎం కోటేశ్వరరావు ఎన్నికలు జరిగాయి. చైర్మన్‌గా చేజర్ల శ్రీను, వైస్ చైర్మన్‌గా ఎస్. సాలెమహేశ్వరి ఎంపికయ్యారు. కరవది హైస్కూల్లో హెచ్ఎం రవి కుమార్ ఎన్నికలు నిర్వహించగా చైర్మన్‌గా చిక్కాల శారద, వైస్ చైర్మన్‌గా రాయపాటి ఇజ్రాయేల్ ఎన్నికయ్యారు. గుండాయి పాలెంలో హెచ్ఎం రమేష్, సీనియర్ టీచర్ రామారావు ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్‌గా ఎస్. వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా ఎస్. నాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాలూకా పోలీస్ సిబ్బంది అన్ని పాఠశాలలో బందోబస్త్ నిర్వహించగా, ఒంగోలు ఎంఈఓలు కిషోర్ బాబు, సరస్వతి పర్యవేక్షణ చేశారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో రమణయ్య తెలిపారు. మండలంలో మొత్తం 64 పాఠశాలలు ఉండగా, 63 పాఠశాలల్లో పాఠశాల కమిటీ ఎన్నికలు పూర్తయినట్లు ఎంఈవో రమణయ్య తెలిపారు. ఈదుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోరం లేనందున కమిటీని ఎంపిక చేయలేదని, త్వరలో అక్కడ ఎన్నికలు నిర్వహించి కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతం

కొత్తపట్నం: మండలంలో గురువారం జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతగా ముగిశాయి. ఎక్కడా అవాంఛన సంఘటనలు జరగకుండా ఎన్నికలు ముగించారు. మండలంలో 52 పాఠశాలలుండగా 46 ఏకాగ్రీవంగా ఎన్నుకోగా, 5 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. కొత్తపట్నం బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3, 4 తరగతులకు కోరం కావడంతో ఎన్నిక జరిగింది. మిగతా తరగతులకు కోరం కాకపోవడంతో ఎన్నికలు నిలిచి పోయాయి. దీనితో ఆ పాఠశాలలో చైర్మన్ ఎన్నిక ఆగిపోయింది. ప్రైమరీ 37 పాఠశాలలు, యూపీ స్కూల్ 3, హైస్కూల్స్ 5, కేజీబీవీ 1 ఏకాగ్రీవింగా ఎన్నుకున్నారు. 5 పాఠశాలలకు పోటీ పడ్డారు.

ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు తల్లి దండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. 1 గంట తరువాత ఎన్నికలు ప్రారంభించారు. కోరం కావడంలో 51 పాఠశాలలు ఎన్నిక పూర్తి చేశారు. 51 పాఠశాలలను చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

మద్దిపాడు: మండలంలోని 40 ప్రభుత్వ ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత, ఒక ఉన్నత పాఠశాల, 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎక్కువ శాతం ఏకగ్రీవంగానే ఎంపికవగా, ఘడియపూడి, లింగంగుంట హెచ్‌డబ్ల్యూ, కొలచనకోట హెచ్‌డబ్ల్యూ, పెదకొత్తపల్లి హైస్కూల్లో మాత్రం ఎన్నికలు జరిగాయి. ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరావులు అభినందించారు. గార్లపాడులో కోరం లేకపోవడంతో ఎన్నికలు నిలిపివేశారు.


త్రోవగుంట హైస్కూల్లో ఎన్నికల దృశ్యాలు


మదనూరు పట్టపుపాలెంలో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఉపాధ్యాయులు


పెదకొత్తపల్లిలో ఓట్లు వేయడానికి వచ్చిన తల్లిదండ్రులు

పొదుపు మంత్రాన్ని పాటించండి


ర్యాలీలో పాల్గొన్న యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ రవికుమార్, సిబ్బంది

ఒంగోలు సెంట్రల్: ప్రతి ఒక్కరూ పొదుపు మంత్రాన్ని పాటిస్తే ఆపద సమయంలో ఆదుకుంటుందని యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ వి. రవికుమార్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నూతన డిపాజిట్ పథకాన్ని ప్రోత్సహించేందుకు బ్యాంకు అధికారులు గురువారం బైక్ ర్యాలీని నిర్వహించారు. డిప్యూటీ రీజనల్ హెడ్‌లు బి. శ్రీనివాసరావు, కె. రామలింగేశ్వర రావు, వివిధశాఖల బీఎంలు, సిబ్బంది పాల్గొని పట్టణంలోని మినీ స్టేడియం నుంచి ర్యాలీ ప్రారంభమై రైల్వేస్టేషన్, అద్దంకి బస్టాండ్, కర్నూల్ రోడ్, ముంగమూరు రోడ్, సాయిబాబ ఆలయం, సంతపేట, రిమ్స్, భాగ్యనగర్ ప్రాంతీయ కార్యాలయం వరకు సాగింది. స్పెషల్ డిపాజిట్ స్కీమ్ -333 రోజులకు సూపర్ సీనియర్ సిటిజన్స్ 8.15, వయోవృద్ధులు 7.90, ఇతరులు 7.40 శాతం ఇవ్వనున్నట్లు వివరించారు. గ్యారెంటీ లేని పథకాలలో కష్టపడి సంపాదించిన సొమ్మును పెట్టి పోగొట్టుకోవద్దని ర్యాలీలో విన్నవించారు.

విమానాశ్రయం నిర్మించాలి

ఒంగోలు: ఒంగోలు వద్ద విమానాశ్రయం నిర్మించాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో సివిల్ ఏవియేషన్ బిల్ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ 2014లో దేశంలో 74 విమానాశ్రయాలున్నాయన్నారు. విమానయాన అధికార బృందం కూడా ఒంగోలు వచ్చి 650 ఎకరాల స్థలాన్ని పరిశీలించారన్నారు. దీనిని ఆమోదించాలని కోరారు.

క్లుప్తంగా

సీబీఐడీటీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ఒంగోలు సెంట్రల్: రెడ్ క్రాస్ సంస్థ మరియు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్ డైరెక్టర్ ట్యాక్సస్ మరియు కస్టమ్స్ ఆధ్వర్యంలో క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రక్త దాన శిబిరం నిర్వహించారు. క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రెడ్ క్రాస్ సభ్యులు డాక్టర్ జీవీ సుబ్బారావు, బీవీ రెడ్డి, డాక్టర్ కె. శ్రీనివాస రెడ్డి, డాక్టర్ వైవీ హనుమంత రావు, క్విజ్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ విభాగపు అధిపతి డాక్టర్ జి. నవనీత కృష్ణన్‌లు రక్తదాన ప్రాముఖ్యతను వివరించారు. 50 మంది విద్యార్థులు రక్తదానం చేయగా.. వారికి ప్రశంస పత్రాలను అందించారు. సేవా కార్యక్రమాల్లో ముందుండాలని చెప్పారు.

నైపుణ్యం పెంచుకుంటే మంచి భవిష్యత్తు

ఒంగోలు టౌన్: మనకు ప్రవేశం ఉన్న పనుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా జైలులో జిల్లా వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు), ప్రేరణ ఎన్జీఓ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రేరణ సంస్థ సీఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ ఖైదీలకు టైలరింగ్, ఎలక్ట్రికల్ వర్క్, ప్లంబింగ్ మొదలైన వాటిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జైలు వైద్యాధికారి బ్రహ్మతేజ, జైలర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలి

ఒంగోలు సెంట్రల్: విద్యార్థి దశలో మంచి ఆలోచనలను తల్లిదండ్రులు, ప్రొఫెసర్స్‌తో పంచుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్, సినీ నటుడు కె. వెంకట ప్రదీప్ అన్నారు. రైజ్ క్రిష్ణ సాయి గ్రూప్ విద్యాసంస్థలో గురువారం ఇంజినీరింగ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకట ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థి దశలో తమ బలహీనతను గుర్తించి దానికి జయించటానికి తీసుకోవాల్సి జాగ్రత్తలు ఉదాహరణలతో వివరించారు. ట్రైనర్ బొల్లా శివ రంజన్ రెడ్డి మాట్లాడుతూ జీవితంలో మార్పు సహజమని ఆమార్పు మంచి వైపు ఉంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరటం ఖాయమన్నారు. కళాశాల చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కర రావు, ప్రిన్సిపాల్ కేవీ సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ జీవీ రమేష్ బాబు పాల్గొని విద్యార్థులకు సందేశం అందించారు.

ప్రకృతి వ్యవసాయంలో సంతృప్తి

కొత్తపట్నం: మండలంలో రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుబడి బాగా చేస్తున్నారని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. శ్రీనివాసరావు సంతృప్తి వ్యక్తం చేశారు. రైతు సాధికార సంస్థ ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి వ్యవసాయం సాగుబడి పరిశీలించారు. మండల అగ్రికల్చర్ ఆఫీసర్ మోహన్‌రెడ్డి, మండల విస్తరణాధికారి అజయ్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కరిముల్లా, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది వికాస్‌రెడ్డి, నరసింహులు, కొట్టం, రెడ్డప్ప, శిరీష, ఇందిరా, వెంకటేశ్వరరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హాజరయ్యారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

ఒంగోలు టౌన్: రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న రైలు కింద గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సుమారు 30 ఏళ్ల వయసు యువకుడు పడిపోయాడు. దీంతో శరీర భాగాలు ఛిద్రమై అక్కడికక్కడే మరణించాడు. మృతుడి శరీరంపై నీలం రంగు టీషర్ట్, నలుపు ప్యాంట్ ఉన్నాయి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు జీఆర్పీ సీఐ 9440904870ను సంప్రదించాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

ఒంగోలు: స్థానిక రాజీవ్ గృహ కల్ప కాలనీలో 100 రోజుల్లోనే మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ హామీ ఇచ్చారు. గురువారం ఒంగోలు వచ్చిన ఆయన కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్థానిక శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్‌రావుతో కలిసి కాలనీ సందర్శించారు. తమకు సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నట్లు మంత్రికి వివరించారు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కాలనీలో మంత్రి పర్యటించారు. అనంతరం మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ సంక్షేమంతోపాటు అభివృద్ధికి కూడా రాష్ట్ర ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. 100 రోజుల్లోనే కాలనీలో మురుగు కాలువలు, సిమెంట్ రోడ్లు నిర్మిస్తామన్నారు. శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ రెండు రోజుల్లోనే టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, హౌసింగ్ పీడీ పేరయ్య, ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు,అధికారులు పాల్గొన్నారు.


రాజీవ్ కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే దామచర్ల

11న అండర్-13 చెస్ చాంపియన్‌షిప్

ఒంగోలు: అండర్-13 జిల్లా స్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలను ఈ నెల 11వ తేదీ నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా చదరంగ కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ నజీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక భాగ్యనగర్ 4వ లైనులోని దాసరి మిను చెస్ హౌస్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు 96667 25719 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మానవతా విలువలు పెంచేవే కళలు

ఒంగోలు మెట్రో: స్థానిక లాయరు పేట షిరిడీ సాయిబాబా మందిరంలో రాఘవ కూచిపూడి నృత్య సంగీత కళానిలయాన్ని గురువారం ప్రారంభించారు. కళానిలయం ద్వారా సంగీతం నృత్యం నటన శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన నిర్వాహకులు కరవది సాయి శరణ్య, కరవది సాయి శ్రావ్యలను అభినందించారు. కరవది రాఘవ కుటుంబం స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం అని కరవది వెంకటేశ్వర్లు స్వాతంత్ర్య సమరయోధులుగా స్వాతంత్ర్య పోరాటంలో పనిచేశారని సభకు అధ్యక్షత వహించిన ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు శ్రీనివాసులు అన్నారు. కళా ప్రకాశం అధ్యక్షులు, నంది అవార్డు గ్రహీత చిట్టా వెంకట శివప్రసాద్, నళినీ ప్రియ కూచిపూడి నృత్యనికేతన్ అధ్యక్షురాలు ఎస్వీ శివ కుమారిలను ఘనంగా సత్కరించారు. శాస్త్రీయ సంగీతం, విశ్వామిత్ర ఏకపాత్రాభినం, కూచిపూడి నృత్యం అలరించింది. నాగలక్ష్మి, సుమంత్, జశ్వంత్, రావిప్రసాదరావు, రుద్రవరం సాయి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రరస అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, నిర్వాహకులు

చట్టాలపై అవగాహన కలిగించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్యాంబాబు

ఒంగోలు సెంట్రల్: విభిన్న ప్రతిభావంతులు చట్టాలపై అవగాహన కలిగి తమ హక్కులను కాపాడుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. శ్యాంబాబు అన్నారు. విభిన్న ప్రతిభావంతుల వసతి గృహంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. శ్యాంబాబు మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. భారతి ఆదేశాల మేరకు నూతన సేవల శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యాయ సేవ అధికార సంస్థ సేవలు అందని వర్గాలకు, రోడ్డు సదుపాయం లేని ప్రాంతాల వారికి సైతం న్యాయ సేవలు అందించే విధంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక చట్టాలున్నాయని, సమాజంలో ఎవరైనా గేలిచేసినా, శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పెట్టినా చట్టప్రకారం శిక్షార్హులని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులు అదనపు సంచాలకులు జి. అర్చన మాట్లాడుతూ అర్హత కలవారికి అందాల్సిన ప్రభుత్వ పథకాలు అన్ని అందేలా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ మానసిక వైద్యురాలు బి. పూజిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసిక స్థైర్యం కలిగి ఉండాలని, మానసిక సమస్యలు ఎదురైనప్పుడు మానసిక వైద్యులను సంప్రదించి నివృత్తి చేసుకోవాల్సిన విధానాన్ని వివరించారు. బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్యాంబాబు

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణాలు పునఃప్రారంభించి కార్యక్రమాలు కొనసాగించాలని ఎంపీడీఓ శ్రీహరి సూచించారు. ఏపీఎస్ఐ ఆర్‌డీ రామనాథం ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించగా, ఎంపీడీఓ పాల్గొని ప్రసంగించారు. గతంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు నిర్మాణం చేసి వదిలివేసిన వాటిని కూడా మళ్లీ కొనసాగించాలన్నారు. రామనాథం మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం ఘన పదార్థాల నిర్వహణ, చెత్త సేకరణ, పొడి చెత్త వేరు చేయడం, వర్మీకంపోస్టు తయారు చేయడం, వర్మీ కంపోస్టును మార్కెటింగ్ చేయడం, ఎస్‌హెచ్‌జీ సభ్యుల భాగస్వామ్యం, ప్రజలను భాగస్వాములుగా చేర్చుకునే విధంగా ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్న అంశాలను వివరించారు. అనంతరం ఈఓపీఆర్‌డీ రఘుబాబు గ్రామ పంచాయతీ విధులు, కామన్ అడ్మినిస్ట్రేషన్ ప్రొసీజర్‌లోని సెక్షన్ల గురించి కూలంకషంగా చర్చించి సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ మేనేజర్ అమర్‌బాబు, పలువురు సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ సీహెచ్ శ్రీహరి, ఏపీఎస్ఐ ఆర్‌డీ రామనాథం

రాష్ట్రీయ రహదారులకు టోల్ దారుణం

ఒంగోలు టౌన్: ఒక వైపు జాతీయ రహదారులకు సంబంధించి టోల్ ట్యాక్స్ వసూలు చేస్తుంటే మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర రహదారులకు టోల్ ట్యాక్స్ కట్టమంటూ ప్రజలపై మోయలేని భారం మోపుతోందని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటినపల్లి శ్రీనివాసరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలోని 8500 కిలోమీటర్ల జాతీయ రహదారులకు టోల్ ట్యాక్స్ జనం కడుతున్నారని తెలిపారు. వాహనాల రిజిస్ట్రేషన్ సందర్భంగా లైఫ్ ట్యాక్స్, డీజిల్ ట్యాక్స్, పెట్రోలు ట్యాక్స్, రోడ్డు సెస్‌లను వసూలు చేస్తున్నారని, ఇప్పుడు రాష్ట్ర రహదారులపై కూడా టోల్ ట్యాక్స్‌లను వసూలు చేస్తే ప్రజలు భరించలేరన్నారు. దీని వలన నిత్యావసర వస్తువుల ధరలు పెరిగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2016లోనే ఈ నిర్ణయం తీసుకున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారని, అయితే ఆ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తయ్యపరెడ్డి , బి. వెంకటేశ్వరరావు, తంబి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ, ఏఐపీటీ డబ్ల్యూఎఫ్ జిల్లా కమిటీ నాయకులు

12న విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు

ఒంగోలు సెంట్రల్: ఏపీ రాష్ట్ర బయోడైవర్సిటీ, ఏపీ ఎస్‌జీసీ ఆధ్వర్యంలో విద్యాశాఖ సహకారంతో జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తామని.. జిల్లా విద్యాశాఖాధికారి డి. సుభద్ర తెలిపారు. '' రోల్ ఆఫ్ బయోడైవర్సిటీ కన్జర్వేషన్'' అనే అంశంపై వక్తృత్వ, వ్యాస రచన, క్విజ్ పోటీలు ఉంటాయని చెప్పారు. ఒక్కో పోటీలో ఒక పాఠశాల నుంచి ఒకరు మాత్రమే వక్తృత్వ, వ్యాస రచన పోటీలో పాల్గొనాలని తెలిపారు. క్విజ్ పోటీలో ఒక పాఠశాలకు ఒక టీమ్ (ఇద్దరు) విద్యార్థులు పాల్గొనాలని చెప్పారు. ఈనెల 12న ఒంగోలులోని బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేసి పోటీలో పాల్గొనేలా చూడాలని డీఈఓ కోరారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

మద్దిపాడు: ఎక్కడైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా జాయింట్ కలెక్టర్ రోనంకి గోపాలకృష్ణ హెచ్చరించారు. గురువారం ఒంగోలు నుంచి దొనకొండ వెళ్తూ మార్గం మధ్యలో మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి బ్రిడ్జిపై ప్రయాణిస్తూ సమీపంలో ఇసుక తోడుతున్న జేసీబీ, ట్రాక్టర్లను జేసీ గమనించారు. వెంటనే ఆగి మండల తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎస్ఐ వి.మహేష్‌లకు ఫోన్ చేసి పిలిచారు. వారితో కలిసి నేరుగా ఇసుక తవ్వుతున్న ప్రాంతానికి వెళ్లారు. అప్పటికే ఒకటిరెండు ట్రాక్టర్లు అక్కడి నుంచి జారుకోగా, మిగిలిన రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీని పట్టుకుని జేసీ సీజ్ చేయించారు. ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ, తహసీల్దార్‌లకు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ శాఖ సిబ్బందితో 24 గంటల పర్యవేక్షణ ఉంచాలని, ఇసుక అక్రమంగా రవాణా అయినట్లు తెలిస్తే క్షమించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్న విషయంపై పత్రికల్లో వార్తలు వచ్చినా పట్టించుకోని అధికారులు, సెబ్, ఇంటెలిజన్స్, మైనింగ్ శాఖ అధికారులు ముచ్చెమటలు పడుతూ వెల్లంపల్లి చేరుకున్నారు. అప్రమత్తంగా ఉండి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని వారిని జేసీ హెచ్చరించారు. కాగా, మద్దిపాడు మండలంలోని కొలచనకోట నుంచి అక్రమంగా ఇసుక తవ్వుకుపోతున్న ట్రాక్టర్‌ను ఆర్ఐ అనూష పట్టుకుని సీజ్ చేసి మండల కార్యాలయానికి తరలించారు.


జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేయిస్తున్న జేసీ గోపాలకృష్ణ

తలసేమియా బాధితులను ఆదుకుందాం

- ఏపీ సెంట్రల్ జీఎస్టీ ఒంగోలు, మార్కాపురం సూపరింటెండెంట్ పురుషోత్తం పిలుపు
- రక్తదాన శిబిరంలో 115 యూనిట్ల రక్తం సేకరణ

చీమకుర్తి: తలసేమియా రోగులను ఆదుకుందామని సెంట్రల్ జీఎస్టీ ఒంగోలు, మార్కాపురం సూపరింటెండెంట్ పాలపర్తి పురుషోత్తం ఇంజినీరింగ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఏపీ సెంట్రల్ జీఎస్టీ పిలుపు మేరకు ఒంగోలు రేంజ్ సీఎస్‌టీ ఆధ్వర్యంలో ఒంగోలు రిమ్స్ సహకారంతో స్థానిక పేస్, రైజ్ ఇంజినీరింగ్ కాలేజీల క్యాంపస్‌లలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్ల సహకారంతో ఇంజినీరింగ్ విద్యార్థుల నుంచి 115 యూనిట్ల రక్తం సేకరించి రిమ్స్‌కు అందించినట్లు పురుషోత్తం తెలిపారు. ఏపీ సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ పిలుపు మేరకు గతేడాది 1,412 యూనిట్ల రక్తం సేకరించి తలసేమియా పేషంట్లకు అందజేసిన సంఘటన గిన్నిస్‌బుక్‌లో నమోదైందని పురుషోత్తం తెలిపారు. తలసేమియా రోగుల ఆరోగ్యం కోసం సెంట్రల్ జీఎస్టీ తరఫున రక్తదాన శిబిరాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తమ సెంట్రల్ జీఎస్టీ సిబ్బందిని, కాలేజీ విద్యార్థులను, ప్రిన్సిపాళ్లను అభినందించారు.


రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ పురుషోత్తం, సిబ్బంది